మోడి వంతెనకు మోక్షం

- పూర్తయిన టెండర్ల ప్రక్రియ
- త్వరలో పనుల ప్రారంభం


మొగల్తూరులో దర్బరేవు డ్రెయిన్‌పై వంతెన ప్రతిపాదిత ప్రాంతం

మొగల్తూరు: మొగల్తూరు-మోడి గ్రామాలను కలుపుతూ దర్బరేవు డ్రెయిన్‌పై నిర్మించనున్న వంతెనకు త్వరలో మోక్షం కలుగనుంది. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న వంతెన పనులకు రూ.12 కోట్లు నిధులు మంజూరు కావడంతో పాటు టెండర్లు కూడా ఖరారయ్యాయి. ఇటీవలే అధికారుల బృందం వంతెన నిర్మించే ప్రాంతాన్ని పరిశీలించి వెళ్లారు. ఈనెలాఖరు నాటికి పనులు ప్రారంభించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

పనులు దక్కించుకున్న హైదారాబాద్ సంస్థ

మొగల్తూరు-మోడి గ్రామాలను కలుపుతూ దర్బరేవు డ్రెయిన్‌పై వంతెన నిర్మించేందుకు హైదరాబాద్‌కు చెందిన కాంటెక్ సిండికేట్ ప్రవేట్ లిమిటెడ్ అనే సంస్థ టెండర్లు దక్కించుకుంది. సుమారు రూ.12 కోట్లతో 60 మీటర్ల పొడవు, 7.10 మీటర్ల వెడల్పు, 3 పిల్లర్లతో వంతెనను నిర్మించనున్నారు. ఈ నెలాఖరు నాటికి పనులు మొదలు పెట్టాలని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ఆదేశించడంతో అధికారులు ఈ నెల మొదటి వారంలో వంతెన నిర్మించే ప్రాంతాన్ని పరిశీలించి వెళ్లారు. అయితే వంతెన నిర్మించే ప్రాంతంలో కొన్ని సమస్యలు ఉండటంతో వాటిని పరిష్కరించమని స్థానిక అధికారులకు పలు సూచనలు అందజేశారు.

ఇరుగ్రామాల ప్రజలు చిరకాల వాంఛ

మొగల్తూరు-మోడి గ్రామాలను కలుపుతూ దర్బరేవు డ్రెయిన్‌పై మోడి వంతెన ఇరుగ్రామాల ప్రజల చిరకాల వాంఛ. దర్బరేవు డ్రెయిన్‌పై వంతెన నిర్మాణం కోసం ఎన్నో ఏళ్లుగా ఇరుగ్రామాల ప్రజలు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. వంతెన పనులు ప్రారంభిస్తేకానీ ఎన్నికలలో పాల్గొనబోమంటూ గత టీడీపీ హయాంలో మోడి గ్రామస్తులు స్థానిక సంస్థల ఎన్నికలను రెండు సార్లు బహిష్కరించి వార్తల్లో నిలిచారు. అయితే అప్పటి టీడీపీ నాయకులు నిధులు మంజూరయ్యాయని హడావిడి చేసినా ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉంది.


వంతెన నిర్మించే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నిధులు మంజూరు చేసి శంకుస్థాపన చేసిన వైఎస్

మొగల్తూరు-మోడి గ్రామాల మధ్య వంతెన నిర్మాణ ఆవశ్యకతను అప్పటి కాంగ్రెస్ పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్, ప్రస్తుత ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన 2009 జనవరి 31న రాజీవ్ పల్లెబాటలో భాగంగా మొగల్తూరు మండలంలో పర్యటించిన సందర్భంలో వంతెన నిర్మాణానికి రూ.2.80 కోట్లు మంజూరు చేసి శంకుస్థాపన చేశారు. దీంతో ఇరుగ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అయితే తదనంతర పరిణామాలతో నిధులు ఉన్నా వంతెన నిర్మాణ పనులు మొదలు కాలేదు. అయితే తిరిగి ముదునూరి ప్రసాదరాజు ఎమ్మెల్యే అయిన తరువాత మోడి వంతెనపై దృష్టి సారించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి వంతెన ఆవశ్యకతను తెలియజేయడంతో ఏబీబీ నిధులు రూ.12 కోట్లు నిధులు మంజురుకు కృషి చేశారు.

ఈ వంతెన నిర్మాణం ఎంతో ఉపయోగకరం



ఈ వంతెన నిర్మాణం పూర్తయితే ఇరు గ్రామాల ప్రజల రాకపోకలతో పాటు రవాణా సౌకర్యం కూడా పెరుగుతుంది. ఇప్పటికే తీర ప్రాంత గ్రామాల నుంచి నిత్యం కొబ్బరి, సర్వే బాదులు లోడులతో లారీలు పదుల్లో సంఖ్యతో తిరుగుతుండడంతో జాతీయ రహదారి చాలా దగ్గర దారి అవుతుంది. కోస్టల్ కారిడార్ కూడా ఇదే గ్రామం నుంచి విస్తరించడంతో తీర ప్రాంత గ్రామాలు అభివృద్ధి చెందుతాయి.

– ముదునూరి ప్రసాదరాజు, చీఫ్‌విప్

ఇరుగ్రామాల ప్రజల కోరిక నెరవేరనుంది



దివంగత నేత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి శంకుస్థాపన చేశారు. అయితే అప్రోచ్ రోడ్డు వేసి పనులు నిలిపివేశారు. తిరిగి ఎమ్మెల్యే ప్రసాదరాజు హయాంలో నిధులు మంజూరు కావడంతో మొగల్తూరు -మోడి గ్రామాల ప్రజల మాచిరకాల వాంఛ నెరవేనుంది.

– కడలి ఏసు, మోడి

విశాఖ యాత్రకు ప్రత్యేక బస్సులు

నరసాపురం: వేసవిలో ఆహ్లాదకరంగా విహార యాత్ర చేసేందుకు వీలుగా ప్రతీ శనివారం నరసాపురం డిపో నుంచి విశాఖపట్నానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు ఆర్టీసీ డిపో మేనేర్ ఎస్.సుబ్బన్నరెడ్డి చెప్పారు ప్రతీ శనివారం ఉదయం 9 గంటలకు నరసాపురం బస్ స్టేషన్ నుంచి బస్సు బయలుదేరుతుందని చెప్పారు. సింహాచలం, కైలాసగిరి, హుడా పార్కు, నేవీ మ్యూజియం, సబ్‌మెరైన్‌బీచ్, ఆర్కేబీచ్, కాళీ టెంపుల్ ఇలా 7 ప్రదేశాలను సందర్శించేలా ఏర్పాటు చేశామన్నారు. శనివారం బయలుదేరిన బస్సు మళ్లీ సోమవారం ఉదయం గమ్యస్థానానికి చేరుకుంటుందని చెప్పారు. పెద్దలకు రూ.1110, పిల్లలకు రూ.850 చార్జీ నిర్ణయించినట్టు చెప్పారు. రిజర్వేషన్ సౌకర్యం ఉందని, ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

ఘనంగా జాజులమ్మ జాతర

నరసాపురం రూరల్: మండలంలోని తెలగంశెట్టివారి మెరకలోఉన్న జాజులమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 16న ప్రారంభమైన అమ్మవారి జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నిప్పుల గుండం, గరగ నృత్యాలు, విచిత్ర వేషదారణలు, తీన్‌మార్ నృత్యాలు అలరించాయి. బాణసంచా కాల్పులు అట్టహాసంగా నిర్వహించారు. తెలగంశెట్టిమెరక, కోలావారిమెరక, నాజేటిపాలెం ప్రాంతాలకు చెందిన భక్తులు ఈ జాతర మహోత్సవాల్లో పాల్గొన్నారు. ముగింపు వేడుక లను పురస్కరించుకుని శుక్రవారం అఖండ అన్న సమారాధనను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

క్లుప్తంగా

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు


వైఎస్ కళాశాల లైబ్రరీలో విద్యార్థులు

నరసాపురం: నరసాపురం శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణా తరగతుల ఉత్సాహంగా సాగుతున్నాయి. స్టడీ టూర్ కార్యక్రమంలో భాగంగా పిల్లలను వైఎస్ కళాశాలకు తీసుకెళ్లారు. కళాశాల లైబ్రరీ, హెచ్ఆర్డీ సెంటర్, గాంధీ అధ్యయన కేంద్రాలను చూపించారు. వైఎస్ కళాశాలలో చదువుకుని ఉనత్న స్థానాలకు వెళ్లిన వారి వివరాలు డాక్టర్ చినిమిల్లి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ఏపీవీ అప్పారావులు పిల్లలకు వివరించారు. ఈ సందర్భంగా నరసాపురం గ్రేడ్-1 గ్రంథాలయం లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి మాట్లాడుతూ వచ్చే నెల 11 వతేదీ వరకూ ఈ శిక్షణా కార్యక్రమం సాగుతుందని చెప్పారు.

మాల మహానాడు మండల అధ్యక్షుడిగా కుమార స్వామి


కుమారస్వామికి నియామకపత్రాన్ని అందిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాదరావు

మొగల్తూరు: మాల మహానాడు కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళాలని పీవి రావు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మపు సూర్యవరప్రసాదరావు సూచించారు. గురువారం పేరుపాలెం పంచాయతీ దేవునితోటలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల మాల మహానాడు అధ్యక్షునిగా ఇంజేటి కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా గూడపాటి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా గూడపాటి బాపనయ్య, కార్యదర్శిగా పాలపర్తి గణేష్,పిడకాల నాగరాజులకు నియామకపత్రాలను అందించారు. ఈకార్యక్రమంలో నాయకులు కొఠ్రపాటి వీరాస్వామి, బళ్ళా రాజశేఖర్, బుంగా జయరాజు, జేవీఆర్ పాల్గొన్నారు.

వైభవంగా దానమ్మ ఆలయ వార్షికోత్సవం


పెనుమంట్రలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుమంట్ర: స్థానిక పెద్ద చెరువు గట్టున ఉన్న శ్రీ దానమ్మవారి ఆలయ వార్షికోత్సవం గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించి అనంతరం అమ్మవారిని పూల రథంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. తీన్‌మార్ వాయిద్యాలతో బాణసంచా కాల్పులతో అమ్మవారి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు.

ఉపాధి కూలీలకు అవగాహన

పెనుమంట్ర: ఉపాధి కూలీలు వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆలమూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్‌కుమార్ సూచించారు. గురువారం కొయ్యేటిపాడు గ్రామంలో ఉపాధి హామీ పనులు చేసుకుంటున్న కూలీల వద్దకు వెళ్లి వారికి ఉష్ణోగ్రతలు ఎక్కువ అవడం వల్ల వడ దెబ్బ తగిలే ప్రమాదం ఉందని ఎండ తీవ్రత ఉన్న సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పని చేస్తున్నా చెమటలు పట్టక పోవడం, శరీరం పొడిబారి ఎర్రబారడం, తలనొప్పి, దురదలు, వాంతులు, స్పృహకోల్పోవడం వంటివి జరుగుతాయని అటువంటి సమయంలో వెంటనే తమ ఆరోగ్యసిబ్బందిని సంప్రదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ పి.బి.రామారావు, కమ్యునిటి హెల్త్ ఆఫీసర్ వినీత పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో ఫ్యామిలీ ఫిజీషియన్

పెనుమంట్ర: ప్రభుత్వం నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాలను అంగన్‌వాడీ కేంద్రంలో క్రమం తప్పకుండా నిర్వహించాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ జిల్లా అధికారిణి బి.సుజాతారాణి అన్నారు. గురువారం ఆమె పాలమూరు గ్రామంలోని 24, 25 నెంబరు అంగన్‌వాడీ కేంద్రాలలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ సేవలు పొందుతున్న గర్భిణులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట పెనుమంట్ర ప్రాజెక్ట్ అధికారిణి మేరీ ఎలిజిబెత్, సూపర్‌వైజర్ జె.సుజాత, అంగన్‌వాడీ టీచర్ సీహెచ్ నాగమణి, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ఆగర్రులో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ


ఆగర్రులో అంబేడ్కర్ విగ్రహానికి నమస్కరిస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: బాబా సాహెబ్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు యువతరానికి ఆదర్శం కావాలని శాసన మండలి సభ్యులు కవురు శ్రీనివాస్ అన్నారు. పాలకొల్లు మండలం ఆగర్రు శివారు మైజారుగుంటలో నూతనంగా నిర్మించిన బాబా సాహెబ్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సాకా గంగారత్నం అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్సీ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలోని యువత విద్యావంతులు కావాలన్నారు. చదువుకుంటే ఉన్నత భవిష్యత్ ఏర్పడుతుందని గుర్తించాలన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ గంగారత్నాన్ని యువజనుల తరపున ఎమ్మెల్సీ శ్రీనివాస్ శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, ఆర్డీఓ దాసి రాజు, మండల కోఆప్షన్ సభ్యులు తండా ఇస్సాక్‌రాజు, పార్టీ మండల కన్వీనర్ ఎం మైఖేల్‌రాజు, మాజీ సర్పంచ్ రాచమళ్ల మీరయ్య, మాజీ సొసైటీ అధ్యక్షుడు మేడిది జాన్‌డేవిడ్ రాజు, గ్రామంలోని యువజనులు కమలాకర్, కోటేశ్వరరావు, సుధాకర్, మేడిది నాని, ప్రసాద్, అశోక్ పాల్గొన్నారు.

రైతులపై టీడీపీది కపట ప్రేమ


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి చంద్రమౌళి

పెనుగొండ: అధికారంలో ఉన్నపుడు వ్యవసాయాన్ని దండగని వ్యాఖ్యానించిన టీడీపీ, నేడు రైతులపై కపటి ప్రేమ చూపిస్తుందని...రైతుల సంక్షేమం కోసం ఆహర్నిశలు కృషి చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాత్రమేనని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మేడపాటి సాయి చంద్రమౌళిశ్వరరెడ్డి అన్నారు. గురువారం తూర్పుపాలెంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యంతో ఇబ్బందులు పడుతున్న రైతన్నలకు సీఎం జగన్‌తో పాటు, నియోజకవర్గంలో మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అండగా నిలిచారన్నారు. స్థానిక టీడీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు ఏనాడు రైతుల సమస్యలూ పట్టించుకోలేదని, వరి చేలోకి దిగిన సంఘటనలూ లేవన్నారు. కాని, నేడు ఆర్భాటం చేస్తు రైతులను మభ్య పెట్టడానికి నానా అవస్థలు పడుతున్నారన్నారు. ఎన్ని చేసినా రైతులు వారిని నమ్మే స్థితి లేకపోవడంతో మతి కోల్పోయి మాట్లాడుతున్నారన్నారు. నియోజకవర్గంలో రైతుల సమస్యల పరిష్కారానికి ఇప్పటి వరకూ మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు నాలుగు లక్షల వరకూ గోనే సంచులను సొంత ఖర్చులతో అందించారన్నారు. ఇంకా మరిన్ని సంచులను రప్పించడానికి సన్నాహాలు చేశారన్నారు. వారి కళ్లకు ఇది కనపడలేన్నారు. అంతేగాకుండా, రైసుమిల్లర్లు, అధికారులతో నిత్య సమీక్షలు నిర్వహిస్తూ సమస్యలు పరిష్కరిస్తున్నారన్నారు. టీడీపీ నేతలు ఇప్పటికైనా వాస్తవాలు అంగీకరించాలని హితవు పలికారు. సమావేశంలో పోడూరు జడ్పీటీసీ గుంటూరు పెద్దిరాజు, పెనుగొండ ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు, ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, పార్టీ నాయకులు మేడిచర్ల పండు, కొవ్వూరి వేణుమాధవ రెడ్డి పాల్గొన్నారు.

భక్తులతో నత్తారామేశ్వరం కిటకిట


రామలింగేశ్వరస్వామికి పాలాభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

పెనుమంట్ర: వైశాఖమాసం ముగింపు మాసశివ రాత్రి పర్వదినం సందర్భంగా గురువారం నత్తారామేశ్వరం గ్రామంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఎండతీవ్రతను కూడా లెక్కచేయకుండా రామేశ్వరస్వామిని, రామలింగేశ్వరస్వామిని దర్శించుకునేందుకు బారులుతీరారు. గోస్తనీ గర్భంలో ఉన్న పరుశురామ ప్రతిష్ట శ్రీ రామలింగేశ్వరస్వామి వైశాఖమాసంలో నెలరోజుల మాత్రమే దర్శనమివ్వడంతో గురువారం ఆఖరి రోజు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో అభిషేకం మండపంలో పెద్ద సంఖ్యలో రుద్రాభిషేకాలు జరిగాయి. అనంతరం స్వామివారికి పల్లకిసేవ నిర్వహించారు. శుక్రవారం నుంచి గోస్తనీలో స్వామి వారు జలదివాసంలోకి వెళ్లిపోవడంతో మళ్లీ ఏడాది వరకూ ఆయన దర్శన భాగ్యం ఉండదు. ఆలయానికి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులకు పాలి గ్రామానికి చెందిన మేడపాటి రామచంద్రారెడ్డి, లక్ష్మి దంపతులు, హైదరాబాద్ కు చెందిన సత్తి శ్రీరామారెడ్డి, కనకదుర్గా దంపతులు ప్రసాద వితరణ చేశారు. అదే విధంగా ఆలయానికి వచ్చిన భక్తులకు స్థానిక యూత్ ఆధ్వర్యంలో అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీధర్, గ్రామసర్పంచ్ వెలగల ధర్మారెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తమనంపూడి అయ్యప్ప రెడ్డి, జి.ఎస్.సత్యనారాయణరెడ్డి, కర్రి సముద్రారెడ్డి, కర్రి తాతారెడ్డి, పడాల కనికిరెడ్డి, కర్రి సత్యనారాయణరెడ్డి, తమనంపూడి రాజేశ్‌రెడ్డి, పోతంశెట్టి రుద్రారెడ్డి పాల్గొన్నారు.

జుత్తిగలో..

పెనుమంట్ర: వైశాఖమాసం మాసశివరాత్రి పర్వదినాన్ని పుర ష్కరించుకుని గురువారం ప్రసిద్ధ శివ క్షేత్రమైన జుత్తిగ గ్రామంలోని శ్రీ ఉమావాసుకీ రవిసోమేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి రుద్రాభిషేకాలు చేయించుకున్నారు. స్వామి వారిని పంచామృతాలతో అభిషేకించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు రామకృష్ణ శర్మ, వాసుశర్మ, గణేష్, పవన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

విలువలతో కూడిన విద్యనభ్యసించాలి


ముత్యాలపల్లిలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న చీఫ్‌విప్ ప్రసాదరాజు

మొగల్తూరు: విద్యార్థులు ఉన్నతమైన విలువలతో కూడిన విద్యనభ్యసించాలని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు సూచించారు. పేరుపాలెం నార్త్‌కు చెందిన వీర సీతారామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆద్వర్యంలో గురువారం ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన తల్లిదండ్రులకు పాదపూజ, పురస్కార మహోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలలో తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులు కారణంగా ఈ ఏడాది పదోతరగతి పరీక్షా ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలలు విజయకేతనం ఎగురవేశాయన్నారు. ఈ సందర్భంగా వీరసీతారామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆద్వర్యంలో పదోతరగతి పరీక్షల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు రూ.2 వేలు నగదు, ప్రశంసా పత్రాన్ని అందించారు. అనంతరం విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పాదపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య రమేష్ గురుజీ, ట్రస్ట్ నిర్వాహకులు బర్రి సీతారామరాజు, బర్రి కృష్ణమోహన్, మున్సిపల్ చైర్ పర్సన్ బర్రి వెంకట రమణ, నాయకులు అందే భుజంగరావు, కర్రి ఏసుబాబు దొంగ మురళీ కృష్ణ, డీవీవీ సత్యనారాయణ, బర్రి శంకర్, రెడ్డిప్ప ధవేజీ, కర్రి వీరాస్వామి, ఆముదాలపల్లి సుబ్రమణ్యం, పాలా లక్ష్మణరావు, నేదునూరి శ్రీనివాస్ ,చల్లా రామ రాజు, తన్నీడి గిరి తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి


కొతాలపర్రులో రైతు సమస్యలను తెలుసుకుంటున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు


కొడమంచిలిలో వైఎస్సార్ బీమా చెక్కును అందిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: అకాలవర్షంతో ఇబ్బందులు ఎదుర్కొన్న రైతుల సమస్యలు పరిష్కారానికి నిత్య పర్యవేక్షణ చేస్తూ అండగా రైతులకు అండగా నిలిచినట్లు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. గురువారం కొతాలపర్రులో ధాన్యం ఒబ్బిడి చేసుకొంటున్న రైతులతో మాట్లాడారు. గోనే సంచుల సమస్యల పరిష్కారానికి సొంత ఖర్చులతో సంచులు ఏర్పాటు చేశామన్నారు. రైసుమిల్లర్లు నుంచి సమస్యలు వచ్చినా సత్వరం పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకుండా పటిష్ట చర్యలు తీసుకొన్నామన్నారు.

కేశవ స్వామి కోనేరు ప్రక్షాళన

రెండవ శ్రీరంగంగా పేర్గాంచిన కొతాలపర్రులోని కేశవ స్వామి ఆలయ కోనేరును ప్రక్షాళన చేసి మంచి నీటి చెరువుగా మార్చడానికి చేస్తున్న పనులను గురువారం పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తోలేటి శ్రీను, వైఎస్సార్ సిపి జిల్లా కార్యదర్శి కాకిలేటి బాపిరాజు, దేవస్థానం చైర్మన్ కొమ్మిరెడ్డి త్రిమూర్తులు, దివి గణపతి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పేదల ధీమా వైఎస్సార్ బీమా

పెనుగొండ: వైఎస్సార్ బీమా పేదలకు ధీమాగా నిలుస్తుందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. గురువారం కొడమంచిలిలో టి.మెరలో ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఇంజేటి సుధాకర్(35) కుటుంబానికి రూ.5 లక్షల చెక్కును మృతుడు తండ్రి ప్రసాద్‌కు అందించారు. ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారాం, ఉప సర్పంచ్ ములగాడ వరప్రసాద్, దేవస్థానం చైర్మన్ బాలనాగు నరేష్, రైతు సంఘ అధ్యక్షుడు మన్నే సుబ్బారావు, యల్లమెల్లి రాజేష్, కొండేటి రమేష్, కొండేటి వరప్రసాద్, బొక్కా రామకృష్ణ, కుసుమే నారాయణమూర్తి, గున్నాబత్తుల వెంకటాచారి, దండు సత్యనారాయణ రాజు, పోలిశెట్టి వనమరాజు, జక్కంశెట్టి వెంకటేశ్వరరావు, జక్కంశెట్టి పద్మారావు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి


దిగమర్రులో విద్యార్థులకు నగదు ప్రోత్సహకాలు అందిస్తున్న సర్పంచ్ రాపాక నగేష్‌కరుణాకర్

పాలకొల్లు అర్బన్: ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడానికి ప్రభుత్వంతో పాటు సమాజంలో దాతలు ముందుకు రావాలని సర్పంచ్ రాపాక నగేష్ కరుణాకర్ అన్నారు. పాలకొల్లు మండలం దిగమర్రు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు గురువారం నగదు ప్రోత్సాహకాలు అందించారు. పాఠశాల హెచ్ఎం షేక్ పీర్ సాహెబ్ వద్ద విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థి అందజేసిన రూ.10 వేలను ప్రథమస్థానంలో నిలిచిన ఉండ్రాజవరపు ప్రసన్నకు రూ.5 వేలు, కటికిరెడ్డి గాయిత్రికి రూ.3 వేలు, బొప్పె ఉమశ్రీకి రూ.2 వేలు నగదు ప్రోత్సహకాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొండేటి మల్లికార్జునరావు, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షుడు పాలపర్తి చంద్రశేఖర్, హెచ్ఎం షేక్ పీర్ సాహెబ్, సహోపాధ్యాయుడు గొల్లమందుల రాజు పాల్గొన్నారు.

వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ జిల్లా కార్యవర్గం ఎన్నిక


డాక్టర్ ఎస్.మహేష్‌కుమార్‌ను అభినందిస్తున్న దృశ్యం

పోడూరు: వెటర్నరీ అసిస్టెంట్స్ సర్జన్స్ వీఏఎస్)జిల్లా కార్యవర్గం అధ్యక్షునిగా పోడూరు మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎస్.మహేష్‌కుమార్ ఎన్నికయ్యారు. భీమవరంలోని జిల్లా జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో గురువారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా సిద్ధాపురం వీఏఎస్ డాక్టర్ భార్గవి సత్య, ఉపాధ్యక్షులుగా ఆలమూరు వీఏఎస్ డాక్టర్ రవికాంత్, సహాయ కార్యదర్శిగా మోగల్లు వీఏఎస్ డాక్టర్ ప్రియాంక రాబర్ట్స్, కోశాధికారిగా దగ్గులూరు వీఏఎస్ డాక్టర్ వరప్రసాద్ ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని పశువైద్యులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

సొసైటీ అధ్యక్షుడు రంభ శ్రీను మృతి


రంభ శ్రీనివాస్

పెనుగొండ: వడలి వ్యవసాయ సహకార పరపతి సంఘ చైర్‌పర్సన్ రంభ శ్రీనివాస్(49) గురువారం తుది శ్వాస విడిచారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. శ్రీనివాస్‌కు భార్య, ఇద్దరు కుమార్తేలు సంతానం. శ్రీనివాస్ మృతిపై మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబానికి అండగా నిలుస్తామన్నారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), జెడ్పీటీసీ సభ్యురాలు పోడూరి గోవర్ధన, పెనుగొండ మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షురాలు దండు పద్మావతి, సర్పంచ్ కాసాని విజయలక్ష్మీ పెద్దిరాజు, ఎంపీటీసీలు రెడ్డి గణేష్, చిటికెన బాబీలు, మండల వైఎస్సార్ సీపీ కన్వీనరు నల్లిమిల్లి వేణుప్రతాపరెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మేడపాటి సాయి చంద్రమౌళీశ్వర రెడ్డి ఉన్నారు.